# పోలీసోపాఖ్యానం

కర్క్‌ఉడ్ దాటగానే నేషనల్ ఫ్రీవే పది మీద అరవై మైళ్ళ స్పీడులో వెడుతున్న విక్రమరావ్, సిగ్నల్ వేయకుండానే - రైట్ లేన్‌లోకి మారాడు, హైవే సిక్స్ ఎగ్జిట్ కోసం. అప్పుడే చూశాడు హఠాత్తుగా తన బ్రీఫ్‌కేస్ ముందు సీట్లోంచి వెనక సీట్లోకి వెళ్లిపడటం, తన పక్కనే అమెరికా బేతాళుడు ప్రత్యక్షం అవటం. ఉలిక్కిపడదామనుకుని, బేతాళుడి పరిచయం ఇంతకు ముందు అయింది కనుక, పడటం మానేసి "హవ్‌డీ" (Texasలో 'హలో' అన్నమాట) అన్నాడు.

"నేను - బేతాళుడ్ని," అన్నాడు బేతాళుడు చిరునవ్వు నవ్వి.

"తెలుసు - నీ కోసమే చూస్తున్నా - ఇంకా రాలేదేమా అని" అన్నాడు విక్రమరావ్.

"ఇందాక ఒకాయన నీలాగానే బ్రౌన్‌గా వుంటే, నువ్వే అనుకుని ఇంకో కారులో దూరాను. అదీ యింకో తెలుగాయనే, ఆయన పేరు రమేష్" - ఇంకో కథకి అప్పుడే ఉపోద్ఘాతం మొదలు పెడుతున్నాడు బేతాళుడు.

హ్యూస్టన్ నగరంలో అరడజను పైగా వున్నారు రమేష్‌లు. వాళ్ళలో ఎవరో ఒకళ్ళు - ఎవరయితేనేం కథ కోసం - అనుకుని విక్రమరావ్, మాట్లాడకుండా వూరుకున్నాడు.



"ఆయన తన ప్రక్కనే వున్న ఫ్రెండ్‌కి పోలీసులతో తన అనుభవం చెబుతున్నాడు - వినటానికి బాగుంటే, వెనక సీట్లో కూర్చుని అంతా విన్నాను. ఆ కథ యిప్పుడు నీకు చెబుతున్నాను - విని ఆనందించు. ఆనందించి ఊరుకుంటే వూరుకోను. నేను అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పి, బ్రతికి బయటపడు. ఓ.కె?"

"సరే కాని - ప్రారంభించు!" అన్నాడు విక్రమరావ్,

కారుని హైవే సిక్స్ మీదకు తిప్పి - రైట్ లేన్‌లో నెమ్మదిగా పోనిస్తూ.

"నెల రోజుల క్రితం - రమేష్ ఆఫీసు నుంచి దారిలో వాళ్ళావిడని పికప్ చేసుకుని ఇంటికి వస్తున్నాడు. సిగ్నల్ లైటు ఎర్రగా మండిపోతుంటే, తనూ ఆలస్యం అవుతున్నదని మండిపోతూ కారు ఆపాడు. అతని కారు ముందర ఒక మోటార్ సైకిల్ ఆగి వుంది. వెనకాల వరుసగా కార్లు వచ్చి ఆగుతున్నాయి. ఆకాశం కారు మబ్బులతో, 'వాన కురిపించడం, ఇప్పుడా కాసేపాగా?' అని టి.వి. వాతావరం చదివేవాణ్ణి అడుగుతున్నది - అప్పుడే ఎర్రలైటు ఆకుపచ్చగా మారింది. మోటార్ సైకిల్ కదిలింది. వెనకనే రమేష్ కారు నెమ్మదిగా కదిలింది. ఒక ఇరవై గజాలు పోగానే మోటార్ సైకిల్ ఆగిపోయింది. చలనం లేదు. కనీసం ఏదో ఇబ్బంది వున్నట్లుగా, ఆరి వెలిగే ఎమర్జన్సీ లైటు కూడా వేయలేదు. రమేష్ కారూ, వెనకాల కార్లూ - అంటే ట్రాఫిక్ అంటా ఆగిపోయింది. రమేష్ వెనకాల వున్న కారులో ఆవిడ "కదలవయ్యా" అని సూచిస్తూ హారన్ మోగించింది. రమేష్ కూడా ఏం చేయాలో తోచక ముందర మోటార్ సైకిల్ అయన్ని కదలమని ఆదలిస్తూ ఒకసారి హారన్ మీద చేయి వేశాడు - అంతే! అప్పుడే మొదలయింది మన కథకి ప్లాటు-" ఆగాడు బేతాళుడు.


"కారు హారన్ మీద ప్లాటు ఏమిటి బేతాళుడుగారూ - మీ బొంద, మీకు వేరే టాపిక్స్ ఏమీ దొరకలేదా?" అన్నాడు విక్రమరావ్.

"అదే బాబూ - ఇండియాకు, అమెరికాకు వున్న తేడా. పూర్వజన్మలో ఇండియాలో కారు హారన్ల మోత భరించలేక నా పాట్లు నేను పడ్డాను. ఇక్కడి కారు హారన్లు అసలు వినపడనే వినబడవు కనుక. అదొక ప్లాటు అయింది." -

'ఓరి - ఈ బేతాళుడి నాలుక నాలుగు ముక్కలవనూ - ఇండియాలో వీడు విక్రమాదిత్యుడి కాలంలో వున్నప్పుడు కార్లు ఎక్కడివి? - వీడి ముఖం - అన్నీ అబద్ధాలూ, వీడూనూ' అనుకున్నాడు విక్రమరావ్.

"సరే కానీ! - తొందరగా కొంపకు చేరాలి - ఆకలి ఆవురావురుముంటున్నది" అన్నాడు విక్రమరావ్.

"ఆఁ! ఎక్కడ వున్నాను? - రమేష్ కారు హారన్ కొట్టగానే, ఆ ముందు వున్న మోటార్ సైకిల్ అతను వెనక్కి తిరిగి, రమేష్ ముఖంలోకి ఒక క్షణం దీక్షగా చూశాడు. మోటార్ సైకిల్‌కి వున్న ఎర్ర, నీలం లైట్లు వేసి సైరన్ కూడా వేశాడు. రమేష్‌ని తనతోపాటు రోడ్డు ప్రక్కకి రమ్మన్నాడు. అప్పుడర్థమయింది రమేష్‌కి, ఆ మోటార్ సైకిల్ మీద వున్నది కాప్ (పోలీసుని కాప్ అంటారిక్కడ) అని. ఇక తప్పదు కనుక, కారుని ప్రక్కకి తీసి, కిటికీ అద్దం క్రిందకు దించాడు. ఆరడుగుల పైన వున్నాడు ఎర్ర పోలీసు. కళ్ళు ఎర్రగా వున్నాయి. రమేష్ దగ్గరకు పూర్తిగా రాకుండానే - "పోలీసునని కూడా లెఖ్ఖచేయకుండా హారన్ కొడతావా? ఎంత ధైర్యం నీకు? - హన్నా! ఉండు, నీ పని చెబుతాను - కనీసం అరడజను టిక్కెట్లు (సినిమా టిక్కెట్లు కాదు, కారు సరిగ్గా నడపనందుకు డబ్బులు కట్టమనే కాగితం) ఇస్తా



నివాళి'' అన్నాడు. అమెరికా పోలీసు కనుక, అమెరికా ఇంగ్లీష్‌లో అన్నాడు. కానీ బేతాళుడు చదువరుల సౌకర్యార్థం తెలుగులో అన్నట్టు చెబుతున్నాడంతే!

రమేష్ అన్నాడు - "నేనేమీ తప్పు చేయలేదు - టిక్కెట్టు తీసుకోటానికి. నడిరోడ్డు మీద ట్రాఫిక్ ఫ్రీగా వెళ్ళవలసిన సమయంలో - నువ్వు (నువ్వు, మీరు ఒక్కటే ఇంగ్లీషులో) హఠాత్తుగా రోడ్డు మధ్య మోటార్ సైకిల్ ఆపావు. అది నీ తప్పు. పోనీ ఏదయినా యిబ్బంది వుంటే, నువ్వు ఎమర్జన్సీ లైట్లు వేయవలసింది. అదీ చేయలేదు. ట్రాఫిక్ ఆగిపోయింది. నా వెనకాల కారు ఆపిన లావాటి నల్లావిడ, నన్ను కదలమని హారన్ కొట్టి భయపెట్టింది. అందుకే నేనూ హారన్ కొట్టాను. దాంట్లో నా తప్పేముంది?''

రమేష్‌ని తేరిపార చూశాడు కాప్. 'బ్రౌన్ దొరగారికి తెల్లవాడి మీద హారన్ వేసే

అంత ధైర్యమా? ఔరా!' అనుకున్నాడు. "నువ్వు హారన్ అంతసేపు గట్టిగా కొట్టి శబ్దం చేశావు. అది తప్పు. పోలీసువాడినని కూడా మర్యాదనివ్వక - ఆ పని చేశావ్ నిన్ను వదలను - నీ డ్రైవర్స్ లైసెన్సు, ఇన్సూరెన్సు చూడనీ" - అన్నాడు.

ఆ రెండూ యిస్తూ అన్నాడు రమేష్ - "నేను హారన్ గట్టిగా అంతసేపు కొట్టలేదు. ఊరికే ఒకసారి 'కుయ్' మనిపించాను, అంతే!" అన్నాడు.

కాప్ రమేష్ చెప్పిన మాటలు వినీ, విననట్లు నటిద్దామనుకొని, నటించే తాహతు లేక, "బ్రేక్ లైట్లు, సిగ్నల్ లైట్లు, హెడ్ లైట్లు, టెయిల్ లైట్లు అన్నీ వేయండి" అంటూ కారు చుట్టూతా ప్రదక్షిణాలు చేస్తూ - అన్నీ క్షుణ్ణంగా పరీక్ష చేశాడు.

రమేష్ కారు కొత్త కారు కనుకా, వాళ్ళావిడ ఇంకా ఆ కారుతో ఏమీ ఆక్సిడెంట్లు చేయలేదు కనుకా, అన్నీ ఎక్కడ వుండవలసిన చోట అక్కడ వున్నాయి. వెలగవలసిన లైట్లు వెలిగాయి. అక్కరలేనివి వెలగలేదు.

"అయినా సరే - అరడజను టిక్కెట్లు ఇస్తాను" అంటూ కారు క్రిందా, కారు మీదా కూడా చూశాడు కాప్. అన్నీ సవ్యంగానే వున్నాయి. ఎర్రబడిన ఎర్రముఖాన కనీ కనపడని ఒక చిరునవ్వుని చూపించి - ఒక టికెట్ అందచేశాడు. "కారు హారన్ చాలాసేపు కొట్టి, ఆ రోడ్డు మీద శబ్ధంచేసి శాంతిని సర్వనాశనం చేశా"డని రాశాడు.

"ఇది అన్యాయం, అబద్ధం, తప్పు నీది - టిక్కెట్టు నాది. వాటీజ్ దిస్" అన్నాడు రమేష్.

"కాదు! తప్పూ, టిక్కెట్టూ రెండూ నీవే. టిక్కెట్ల వెనక ఫోన్ నంబరుంది. పిలిచి కట్నం, కానుకలు ఎంత కట్టాలో కనుక్కో. వెంటనే కట్టేయ్. లేకపోతే ప్రమాదం" అని మోటార్ సైకిల్ ఎక్కి, తుర్రుమనకుండా మామూలుగా వెళ్ళిపోయాడు.

"ఓరి దరిద్రుడా - విదేశీ అమెరికన్ల మీద నీకున్న కసీ, ద్వేషం నా మీద తీర్చుకున్నావా. నేను టిక్కెట్టుకి డబ్బు కట్టను కాక కట్టను, కాక కట్టను, కాక కట్టను. ఏం చేస్తావో చేసుకో" అనుకున్నాడు. అంతే కాకుండా, ప్రక్క యింట్లో వుంటున్న కోయంబత్తూరు తెలుగాయన గోపాలస్వామితో కూడా అదే అన్నాడు.

ఆయన నిజంగా గోపాలస్వామిలాగా చేయి పైకెత్తి నవ్వి, "అది కాదండా, పణం కట్టకపోతే రొంబ ప్రమాదం. మీరు కోర్టుకు దానే పోతే కాప్ కూడా పూడుస్తాడు. ఆడదా అన్నీ చెప్పి చూడండా. ఈడ ఇండియాలో మాదిరి కాదు. కోర్టులో లంచాలు కిట్టవండా నాయం కాణుం!" అన్నాడు.

సరే ఆయన సగం తెలుగులో, సగం తమిళంలో చెప్పినా రెండు భాషల్లోనూ, నిజంగా నిజమే చెప్పినట్టు అనిపించి, "అవునండా" అనబోయి - తట్టుకుని, "ఓ.కే. సార్" అన్నాడు, ఆయన చెప్పింది నిజమేనని ఇంగ్లీష్‌లో ఒప్పుకుంటూ.

తర్వాత ట్రాఫిక్ పోలీస్ డిపార్టుమెంటుకి ఫోన్‌చేసి అడిగితే, "75 డాలర్లు ఫైన్, ఫలానా తేదీలోగా కట్టాలి, లేకపోతే ఫలానా రోజున కోర్టుకి వచ్చి వాదించుకో" అన్నారు.

శనివారం పార్టీల్లో అర్థమైన విషయాల మీదా అందరితో వాదించడం అలవాటయిన రమేష్ కోర్టులో వాదిద్దామనే నిశ్చయించుకున్నాడు.

కొంచెం ఆగాడు బేతాళుడు.

విక్రమరావ్ ఆలోచిస్తున్నాడు - బేతాళుడు ఈ కథని ఎక్కడ మెలిక తిప్పి, ఏ ప్రశ్న అడిగి తనని ఎలా ఇబ్బంది పెడతాడా అని - అందుకే ఆలోచిస్తూ మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

బేతాళుడు విక్రమరావ్ నిద్ర పోతున్నాడా అని అనుమానం వేసి అతన్ని పరీక్షగా చూశాడు. కళ్ళు తెరుచుకుని, నున్నటి తారురోడ్డు మీద మెత్తగా కారుని నడుపుతూ మేలుకునే వున్నాడు విక్రమరావ్.

బేతాళుడు కథ చెప్పసాగాడు -

"రమేష్ కోర్టులో వాదించే రోజున ఆఫీస్‌లో మేనేజర్‌కి 'కడుపులో నొప్పిగా వుందనీ, బాత్‌రూమ్‌కి చాలా సార్లు వెళ్ళవలసి వస్తున్నది కనుక ఆఫీస్‌కి రాలేనని' ఫోన్ మెసేజ్ యిచ్చి, కోర్టుకి వెళ్ళాడు. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళని పేరు పేరునా పిలుస్తున్నారు. ఒక ప్రక్క ముద్దాయిలు, ఒక ప్రక్క కాప్‌లు. ఆ ఇద్దరి వాదనలూ విని జడ్జిగారు తీర్పు ఇస్తున్నారు - కాకపోతే ఆ తీర్పు ఇచ్చే పద్ధతి చాలా విచిత్రంగా వుంది - ఒకావిడని పిలిచి "నువ్వు 65 మైళ్ళ స్పీడులో వెడుతున్నావట, 55 మైళ్ళ స్పీడు దాటకూడని రోడ్డులో - నువ్వు దోషివా - నిర్దోషివా?" అన్నాడు జడ్జి.

ఆవిడ - "లేదు బాబూ, నేను 55 మైళ్ళ స్పీడులోనే వెడుతున్నాను. నేను నిజంగా నిర్దోషిని" అన్నది.

"అలాగని నిరూపించగలవా?" అన్నాడు జడ్జి.

"నేనేమని చెప్పేది? - ఎలా నిరూపించగలను? - పోనీ ఆ కాప్‌గారినే నేను 65 మైళ్ళ స్పీడులో వెడుతున్నానని నిరూపించమనండి!"

"ఏమండీ కాప్‌గారూ - మీరు రాడార్ గన్‌లో, ఆవిడ స్పీడు రికార్డు చేవారా?" అన్నాడు జడ్జి.

"లేదండీ - నేను ఆవిడ 65 మైళ్ళ స్పీడులో వెళ్ళటం కళ్ళారా, ప్రత్యక్షంగా చూశాను. అంతకన్నా ఋజువు ఏముంటుంది, జహాపనా" అన్నాడు కాప్.

'ఓరి నీ కాప్ కావరం మండా' అని మనసులో అనుకుని ఆవిడ, "లేదు జడ్జిగారూ అంతా అబద్దం ...." అని ఆ వాక్యాన్ని ఎలా పూర్తి చేయాలా అనుకుంటుండగా - జడ్జిగారు -

"సరే - నువ్వు దోషివి - నీ ఫైను 50 డాలర్లు నుంచి 80 డాలర్లకు పెంచాను."

ఆవిడ ఈసారి, 'ఓరి జడ్జి వెధవా - నువ్వా ఇంతేనా' అని మళ్ళీ మనసులో అనుకుని "లేదు మహాప్రభూ - నేను"

"ఫైను వంద డాలర్లకు పెంచటమైనది" అని బల్ల విరిగేలాగా చెక్క సుత్తితో బల్ల మీద సుత్తి కొట్టాడు.

"ఓరినీ" ఏదో అనుకోబోయి - ఏమన్నా అంటే నూట యాభై డాలర్లు కట్టమంటాడేమోననుకొని - నోరు మూసుకుని, పక్కకు వెళ్ళి, ఫైను కట్టేసిందావిడ.

అలాగా చాల కేసులు నడిచాయి - అన్నిట్లోను జడ్జిగారు - కాప్‌లనే సమర్ధిస్తున్నారు. ఒకటి రెండు కేసుల్లో, లాయర్లు వాదించిన కేసులు మాత్రం కొంచెం నిజమైన వాద ప్రతివాదనలతో, ముద్దాయిల తరపున తీర్పుతో ముగిశాయి. అంటే ఇక్కడ కట్టే ఫైను లాయరుకిస్తే కేసు గెలుస్తామన్నమాట. దానికోసం శలవు పెట్టి యిక్కడికి రావటం, శ్రమ ఎందుకు ఆ ఫైన్ ముందరే కట్టేస్తే సరిపోదూ అనుకున్నాడు రమేష్.

కాసేపు ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు. తనను పిలిచినప్పుడు తను "నాట్ గిల్టీ - దోషిని కాను" - అని చెప్పదలచుకున్నాడు. జరిగింది చెప్పి, "ఇలా జరిగింది. నా తప్పేం లేదు. కానీ మీరు నాదే తప్పని డబ్బులు కట్టమంటే కడతాను - కోర్టు తీర్పుని ధిక్కరించటం నేరం కనుక. కానీ నిజంగా నేను దోషిని కాను. ఈ కాప్ రెడ్‌నెక్. నా 'బ్రౌన్' తనాన్ని చూసి, తన తప్పును నా మీదకు నెడుతున్నాడు" అని చెబుదామని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

ఈ లోపల, కోర్టు క్లర్కు "రమేష్ ఆకుండై" అని పిలిచాడు. రమేష్ ఆకుండి అన్నదాన్ని 'అమెరికన్ ఇంగ్లీష్'లోకి అనువాదం చేసి - ఇక్కడ ఆగాడు బేతాళుడు.

"విక్రమార్కుడూ! - బాగా ఆలోచించు. తర్వాత ఏమయింది? ఆ జడ్జిగారు, రమేష్ కథ విన్నాడా? - కాప్ ఏం చెప్పాడు? - ఈ కథ సుఖాంతమా? - దుఃఖాంతమా? - అసలు అంతమయిందా? - అనంతంగా మారిందా? - తెలిసీ జవాబు చెప్పలేకపోయావో నీ కారు టైర్లు ఢామ్మని పగిలిపోయి - నీ కారు ఆ ప్రక్కనే వున్న చెట్టుకు గుద్దుకుంటుంది. అప్పుడు నా విక్రమార్కుడు నాకు దక్కడు. బాబ్బాబూ! - ఈ కథ పూరించు నాయనా, నీకు దణ్ణం పెడతాను" అన్నాడు బెదిరించటం ఆపి, హఠాత్తుగా బెదిరిపోయిన బేతాళుడు.

ఆలోచిస్తున్నాడు విక్రమరావ్ - ఆలోచిస్తూనే ప్రక్కకు తిరిగి - రోజుకు ఇరవై నాలుగు గంటలు తెరచి వుంచే "స్టాప్ అండ్ గో" షాప్‌లో రివాల్వర్ చూపించి దొంగతనం చేస్తున్న దొంగల్ని చూస్తూ, కారు స్పీడు పెంచాడు. ఢామ్మని పేలిన చప్పుడు.

"జవాబు చెప్పకుండానే టైర్లు పేల్చేశావా?" అన్నాడు విక్రమరావ్.

"అవి టైర్లు కాదు - ఆ షాప్‌లోని క్లర్కు బుర్ర. ఆ శబ్దం ఆ రివాల్వర్ పేల్చిన

చప్పుడు. టాపిక్ మార్చకుండా, ఠక్కున జవాబు చెప్పు" అన్నాడు భేతాళుడు.

విక్రమరావ్ - కారుని వాళ్ళ సందులోకి తిప్పి, తన ఇంటి వైపు నెమ్మదిగా పోనిస్తూ అన్నాడు -

"ఏం జరిగివుంటుందంటే - కోర్టు క్లర్కు రమేష్‌ని పిలిచాడు. రమేష్‌ని 'నువ్వు దోషివా?' అని అడిగాడు జడ్జి. రమేష్ 'కాదు నేను నిర్దోషిని' అన్నాడు. కోర్టు క్లర్క్ కాగితం మీద కాప్ పేరు చదివి 'డేవిడ్ హాలీడే' అని పిలిచాడు. ఎవరూ రాలేదు. రెండు మూడు సార్లు పిలిచి 'హాలీడే గారు హాలీడే తీసుకున్నట్టున్నారు' అన్నాడు జడ్జితో -

జడ్జి రమేష్ వైపు చూసి, "నువ్వు ఇంటికి వెళ్ళవచ్చు - వెళ్ళాలని వుంటే" అన్నాడు (అమెరికాలో వ్యక్తి స్వాతంత్ర్యం ఎక్కువ. అందుకే ఇక నువ్వు వెళ్లు - అనకూడదు. నీకిష్టం వుంటే వెళ్ళు, వెళ్ళాలనిపిస్తే వెళ్ళు, ఇక్కడ వుండకూడదనిపిస్తే వెళ్ళు - ఇలాంటి పదాలు వాడాలి).

"మరి కేసు - కాప్ - ఫైను."

"కేసూ లేదు - గీసూ లేదు - కాపూ లేదు. గీపూ లేదు. ఫైనూ లేదు. గైనూ లేదు. ఇక ఇంటికో, గింటికో పోవటమే - కాప్ రాలేదు కాబట్టి. ఈ కేసు కొట్టేశాను. ఇంటికి పోవాలనుకుంటే పోయి, హాయిగా టి.వి.లో ఏదన్నా గేమ్ షో చూడాలనుంటే చూసుకో" అన్నాడు క్లర్క్ మహాశయుడు.

"రమేష్ ...." ఇంకా చెప్పబోతున్న విక్రమరావ్‌తో అమెరికా బేతాళుడు - "అందుకేనయ్యా - అమెరికాలో కూడా నీ దగ్గరే ఉద్యోగానికి చేరింది. యు ఆర్ గ్రేట్. రేపు చూద్దాం" అని సీట్లోంచి మాయమయాడు బేతాళుడు.

విక్రమరావ్ వెనక్కి తిరిగి చూస్తే మోబిల్ ఆయిల్ వారి గాసులీన్ ట్రక్ మీద కూర్చుని, చేయి వూపుతూ కనబడ్డాడు అమెరికా బేతాళుడు.

❖